## 123 జెకర్యా పాట

రా - బ్యాగు తా - ఆది

ఇశ్రాయేలీయుల దేవుండే - యెంతో స్తుతి నొందును గాక = యాశ్రితువౌ తన జనులకు దర్శన - మాత్మ విమోచన కలిగించె ॥నిశ్రా॥

1. తన దాసుఁడు దావీదు గృహంబున - ఘన రక్షణ శృంగము నిచ్చె = మన శత్రువు లగు ద్వేషులనుండియు - మనలన్ బాపి రక్షణ నిచ్చె ॥నిశ్రా॥
2. దీనిని గూర్చి ప్రవక్తల నోట - దేవుఁడు పలికించెను దొల్లి = మానవ మన పితరులఁ గరుణింపఁగ - మహిలోన నిబంధనఁ జేసె ॥నిశ్రా॥
3. జనకుం దగు నబ్రాహాముతోఁ - జేసిన యా ప్రమాణముఁ దలఁచి = మనము విరోధులనుండి విమోచన - గని నిర్భయులమై మెలఁగ ॥నిశ్రా॥
4. ఆయన సన్నిధానమునందు - నతి శుద్ధిగ నీతిగ నుండఁ = పాయక తన సేవను నిత్యంబును - జేయఁగ నీ రక్షణ నిచ్చె ॥నిశ్రా॥
5. ధర నో శిశువా దేవుని దీర్ఘ - దర్శి వనెడు పేరొందెదవు = పరమేశ్వరుని వాత్సల్యతతోఁ - పాపవిముక్తిఁ బ్రజ లొంద ॥నిశ్రా॥
6. మానుగ రక్షణ జ్ఞాన మొసంగఁగ - మార్గము సిద్ధపరచుటకై - దీన మనస్సుతోఁ బ్రభునకు ముందు - గా నడిచెదవు భయభక్తి ॥నిశ్రా॥
7. మరియును సమాధాన సరణిలో - మన మింక నడువఁ జీఁకటిలో = మరణచ్ఛాయలో నుండిన వారికి - నరుణోదయ దర్శన మిచ్చె ॥నిశ్రా॥
8. జనక పుత్రాత్మ దేవుని కిలలో - ఘనత మహిమ కల్గును గాక = మును పిపు డెప్పుడు తనరి నట్లు యుగ - ములకును దనరారునుగా కామేన్ ॥నిశ్రా॥

- మల్లెల దావీదు

## 124 కన్య మరియ పాట

రా - హిందుస్థాని తోడి తా - ఆది

నాదు ప్రాణము ప్రభుని మిగుల ఘ - నంబు చేయుచున్నది = నాదు నాత్మ దేవునం దా - నం మొందెను నిరతము ॥నాదు॥



1. దేవుఁడు తన భృత్యురాలి - దీనస్థితి లక్షించెను = ఈ వసుంధరఁ దరము లన్నిఁక - నెన్ను నను శుభవతి యని ॥నాదు॥
2. సర్వ శక్తుఁడు మహాకృత్యము - సంభవింపఁ జేసెను = ఉర్విలో నా ప్రభుని నామం - బొప్పు బరిశుద్ధంబుగా ॥నాదు॥
3. భయము భక్తియుఁ గల్గి దేవుని - భజనఁ జేసెడి వారికి = నయముగాఁ దన కృప నొసంగు న - నయమును దరతరములు ॥నాదు॥
4. విదిత బాహువు చేత శౌర్యము - విభుఁడు కనపర్చెను = హృదయపుఁ దలఁపులను గర్వులఁ - జెదరఁ గొట్టెను నిజముగ ॥నాదు॥
5. ఆసనాసీనులై యున్న - యతిశయాత్ములన్ బడఁ = ద్రోసి దేవుఁడు దీనులను సిం - హాసనంబుల నునిచెను ॥నాదు॥
6. క్షుధితులను దన మధురములచేఁ - గోరి తృప్తి పర్చెను = అధిక ధనవంతులను రిక్త - హస్తములతో నపెను ॥నాదు॥
7. ఆది పితరులైన యబ్రా - హాము కతని సంతున = కద్వితీయుఁ డాదిలోక - నాన తిచ్చినట్లుగా ॥నాదు॥
8. నిరతమును దన కరుణఁ జూప = నిజముగా మది నెంచెను = వరదుఁ డిశ్రాయేలునకుఁ దన - వర సహాయ మొనర్చెను ॥నాదు॥
9. పరమ తండ్రికి దైవ సుతునకు - పావనాత్మకు నిఁక నిహ = పరము లందును యుగయుగంబులఁ - బరఁగు మహిమ మామేన్ ॥నాదు॥

- భవాని సమూయేలు

## 125 సుమెయోను పాట

రా - శంకరాభరణము (చాయ: నాకాలగతు లెవ్వి) తా - త్రిపుట

నీ సమాధానము - దాసుని కిప్పుడు - నాథా దేవా = యిచ్చి - నీ మాటచొప్పున - పోనిచ్చుచున్నావు - నాథా దేవా ॥నీ సమాధానము॥

1. అన్యులకు నిన్ను - బయలు పరచెడి - వెలుగుఁగాను = నీకు - నణఁగు ప్రజలైన - యిశ్రాయేల్ వారికి - మహిమ గాను ॥నీ సమాధానము॥